

ఇల్లెందు మండలం నెహ్రూనగర్ గ్రామంలో ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న మహిళలు

## ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

- **మంచినీరు అందించండి.. మహాప్రభో!**
- **భద్రాద్రి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మహిళల నిరసన**

దుమ్ముగూడెం/ చుంచుపల్లి/ ఇల్లెందురూరల్/ చారకొండ, ఏప్రిల్ 25 : భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం మంచినీళ్లు అందించండి.. మహాప్రభో! అంటూ ఖాళీ బిందెలతో గ్రామస్థులు, మహిళలు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెం, చుంచుపల్లి మండలం మాయాబజార్, ఇల్లెందు మండలం నెహ్రూనగర్, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం అగ్రహారం తండాలో మహిళలు రోడ్డుపైకి వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. 20రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మండిపడ్డారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు, మహిళలు మోటరు వద్ద ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది అక్కడకు చేరుకుని మోటరుకు మరమ్మతులు చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం అగ్రహారం తండాలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో పైపులకు మరమ్మతులు చేపట్టారు.

# ఆర్టీసీ సమ్మెపై సర్కారీ మౌనం వెనుక..?

- **సమ్మె జరిగితేనే మంచిదనే ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు!**
- **ఆర్టీసీ విలీనంపై ప్లాన్ ఏ, ప్లాన్ బీ సిద్ధం చేసిపెట్టుకున్న సర్కారు?**
- **ప్రజల్లో చర్చ మొదలైన తర్వాతే అపాయింటెడ్ డే ప్రకటన?**
- **అందుకే సమ్మెపై స్పందించని యాజమాన్యం, ప్రభుత్వం!**
- **ఇప్పటికే సీఎం వద్ద ఫైలు**



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికులు ఇచ్చిన సమ్మె నోటీసులపై ఇటు యాజమాన్యం, అటు ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక బలమైన కారణాలే ఉన్నట్టు తెలుస్తున్నది. ఆర్టీసీ కార్మిక సంఘాలు సమ్మెకు దిగితే ఏం చేయాలనే విషయంలో ప్రభుత్వం ప్లాన్ 'ఏ'తో పాటు, ప్లాన్ 'బీ'ని కూడా సిద్ధం చేసి పెట్టుకున్నదని, సమ్మె జరగాలనే కోరుకుంటున్నదని విశ్వసనీయ సమాచారం. సమ్మె ఎందుకు జరుగుతున్నది? అనే అంశంపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరిగితేనే.. తాము తీసుకునే చారిత్రక నిర్ణయం ప్రజల్లోకి కూడా బలంగా వెళ్తుందనే భావనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు తెలిసింది. ప్లాన్ 'ఏ'లో భాగంగా సమ్మెకు రెండు రోజుల ముందు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించి, మంత్రి సమక్షంలో ఆర్టీసీ విలీనానికి సంబంధించిన 'అపాయింటెడ్ డే'పై ప్రకటన చేసి, ఆ తర్వాత ముఖ్యమంత్రితో దాని గురించి గొప్పగా చెప్పించాలనే వ్యూహంతో ఉన్నట్టు తెలిసింది. ఒకవేళ, ప్లాన్ 'ఏ'లో కార్మిక సంఘాలు సంతృప్తి చెందకపోతే, సమ్మెను రెండు, మూడు రోజులు కొనసాగనిచ్చి, ఆ తర్వాత మరోసారి కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించి, 'ప్లాన్ బీ'ని అమలుచేస్తారని సమాచారం. ఎందుకంటే, ఇప్పటికే ప్రభుత్వంపై విభిన్న వర్గాల్లో వ్యతిరేకత వస్తుండగా, ఆర్టీసీ కుటుంబాలు ఏకమయ్యాయి. దీంతో 'ఆర్టీసీ విలీనం ఎప్పటికైనా చేయాల్సిన పనే కదా.. ఇప్పుడు చేసేద్దాం' అనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. అయితే, సమ్మె డిమాండ్లను ఆమోదించడం అనేది చాలా గొప్పగా ప్రకటించుకోవాలని, అవి ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. అందుకు సమ్మె జరిగితేనే మంచిది అనే కోణంలో ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలిసింది. కాగా, చర్చల విషయంలో ప్రభుత్వం కొంత సానుకూలంగా ఉన్నప్పటికీ, ఒక కీలక వ్యక్తి ఆ చర్చలను అడ్డుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

**ఆ నాలుగు అంశాలకు ప్రభుత్వం ఓకే!**

సమ్మె జరుగుతున్నప్పుడే ప్లాన్ బీలో భాగంగా.. ప్రభుత్వం గొప్పగా ప్రకటించేందుకు కీలకంగా నాలుగు అంశాలను ఎంపిక చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. వాటిల్లో 1) ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింటెడ్ తేదీని ప్రకటించడం 2) 2021 పీఆర్సీలో 20-25% ఫిట్‌మెంట్ ఇవ్వడం 3) ఆర్టీసీలో యూనియన్లకు ఆమోదం తెలపడం 4) ఆర్టీసీ ఉద్యోగుల రిటైర్మెంట్ వయో పరిమితిని 60 ఏండ్ల నుంచి 61 ఏండ్లకు పెంచడం. ఈ 4 అంశాలను ప్రధానంగా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నదని, ఇక మిగిలిన అంశాలపై కమిటీలు వేయడం.. లేదా వాటి అమలు కోసం కొన్ని తేదీలను ప్రకటించడం వంటివి చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఆర్టీసీ విలీన ఫైలు జీఏడీ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకున్నట్టు సమాచారం. దీంతో ప్రభుత్వం అపాయింటెడ్ డేని ప్రకటిస్తే, ప్రభుత్వం మీద పడే ఆర్థికభారం ఎంత? అనే అంశంపై ఆర్థిక శాఖ కూడా తర్జనభర్జన పడుతున్నట్టు తెలిసింది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైతే వచ్చే లాభాలేంటి? నష్టాలేంటి? అనే అంశాలపై ప్రభుత్వ పెద్దలు నిపుణులతో చర్చిస్తున్నట్టు సమాచారం

## ఆరు జిల్లాల్లో 45 డిగ్రీల పైనే..

**రోజురోజుకూ పెరుగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు దంచి కొడుతున్నాయి. ఆరు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటాయి. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. మిగతా 27 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. వడగాలుల కారణంగా ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశమున్నదని పేర్కొంది. ఈనెల 29వరకు దేశవ్యాప్తంగా ఈ వడగాలుల తీవ్రత ఉంటుందని తెలిపింది. మరోవైపు పలు ప్రాంతాల్లో శనివారం వానలు కురిసే అవకాశమున్నదని వాతావరణశాఖ పేర్కొంది. జిల్లాల వారీగా నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు నిర్మల్, నిజామాబాద్ 45.4, జగిత్యాల 45.3, ఆదిలాబాద్ 45.2, మంచిర్యాల 45.1, కుమ్రం భీం ఆసిఫాబాద్ 45.0, జోగులాంబ గద్వాల, నల్లగొండ 44.9, కామారెడ్డి 44.6, పెద్దపల్లి 44.5 డిగ్రీలుగా నమోదయ్యాయి.

## వైద్యశాఖలో 'అబాస్' చిచ్చు

- **ఫేస్ రికగ్నైజేషన్, జియో ట్యాగింగ్‌పై వైద్యుల వ్యతిరేకత**
- **డాటాప్రైవసీకి విరుద్ధమైన విధానమంటూ మండిపాటు**
- **వైద్యుల మనోస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నారని ఆగ్రహం**
- **డుమ్మా కొట్టే డాక్టర్లకు చెక్ పెట్టేందుకే అంటున్న సర్కారు**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దవాఖానలు, వైద్య కళాశాలల్లో పనిచేసే డాక్టర్లు, బోధనా సిబ్బందితో పాటు పారామెడికల్, అనుబంధ సిబ్బందికి మే 1 నుంచి ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు (అబాస్) విధానం అమలు కానుంది. ఇప్పటివరకు వైద్యారోగ్య శాఖలో వేలిముద్ర ద్వారా హాజరు విధానం అమలులో ఉండగా ఎన్ఎంసీ నిర్ణయంతో మార్పులు చోటు చేసుకోనున్నాయి. రాష్ట్రంలో 638 పీహెచ్‌సీలు, 248 అర్బన్ పీహెచ్‌సీలు, 468 బస్తీ దవాఖానలు, టీవీవీపీ పరిధిలోని వైద్యులు, 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పనిచేసే బోధనా సిబ్బందికి ఈ విధానం అమలు కానుంది. అనుబంధ సిబ్బంది సైతం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలి. డ్యూటీలకు డుమ్మా కొట్టే వారికి చెక్‌పెట్టడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేయనున్నట్టు సర్కారు చెప్తున్నది.

**కొత్త విధానం ఎందుకు వద్దంటే!**

ఫేస్ రికగ్నైజేషన్, జియో ట్యాగింగ్‌తో తమ పర్సనల్ డాటా ప్రైవసీకి భంగం కలుగుతుందని వైద్యులు చెప్తున్నారు. ఇంటర్నెట్ సమస్య తలెత్తినప్పుడు, సర్వర్ డౌన్ అయినప్పుడు హాజరు పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎమర్జెన్సీ కేసులు వచ్చినప్పుడు సుదీర్ఘ విధులు, నైట్ డ్యూటీలు చేస్తామని, ఫీల్డ్ వర్క్‌లకు వెళ్తామని వివరిస్తున్నారు. అబాస్ ప్రతిపాదన తమ వృత్తిని అవమానించడమేనని వాపోతున్నారు. ఇలాంటి చర్యలు డాక్టర్ల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని, ప్రజల్లో కూడా తమపై నమ్మకం పోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే సిబ్బంది తక్కువగా ఉండడంతో తమపై పని భారం పడుతున్నదని, ఈ నేపథ్యంలో ఇలాంటి నిర్ణయాలు సరికాదని చెప్తున్నారు. ఇప్పటికే అటెండెన్స్ కోసం సాంకేతికత ఉందని వివరిస్తున్నారు. అబాస్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఒక పేపర్‌కు బదులు మరో ప్రశ్నపత్రం

- **ఇంటర్ పరీక్షల్లో ఘోర తప్పిదం**
- **ఓల్డ్ వర్షన్‌కు బదులు న్యూ వర్షన్ ప్రశ్నపత్రం ఇచ్చిన వైనం**
- **8 మంది విద్యార్థుల ఫలితాలు నిలిపివేత**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ పరీక్షల్లో తప్పిదాలు మీద తప్పిదాలు.. తప్పుల మీద తప్పులు వెలుగుచూస్తున్నాయి. తాజాగా అధికారుల నిర్లక్ష్యంతో ఓ భారీ తప్పిదం వెలుగుచూసింది. ఏకంగా ఎనిమిది మంది విద్యార్థులకు ఒక ప్రశ్నపత్రానికి బదులు మరో ప్రశ్నపత్రాన్ని ఇచ్చిన విషయం బయటికొచ్చింది. విద్యార్థులకు ప్రశ్నపత్రం ఇవ్వడం.. పరీక్షలు రాయడం.. మూల్యాకంనం చేయడం అంతా జరిగిపోయింది. తీరా ఫలితాల విడుదల సమయంలో మాత్రం ఆయా విద్యార్థుల ఫలితాలు నిలిపివేశారు. పాసయ్యారా..? ఫెయిలయ్యారా ? అన్న విషయాన్ని వెల్లడించలేదు. అధికారుల తప్పిదాలకు విద్యార్థులను బలిచేశారు.

**మరీ ఇప్పుడు మార్కులేసేదెట్లు..**

100 మార్కుల ప్రశ్నపత్రం ఇవ్వాల్సి ఉండగా, విద్యార్థులకేమో 80 మార్కుల ప్రశ్నపత్రం ఇచ్చారు. 20 మార్కుల ప్రాక్టికల్స్‌కు వీరు హాజరుకాలేదు. ఇంటర్ వెబ్‌సైట్‌లో ప్రైవేట్ విద్యార్థులుగా నమోదయ్యింది. మార్కులేలా వేయాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రాక్టికల్స్ నిర్వహించి మార్కులేయాలా.. ? లేక 80 మార్కులకే విద్యార్థులకు ఎన్ని మార్కులొస్తే అన్ని మార్కులు కేటాయించాలా? అన్న ప్రశ్నలొస్తున్నాయి. ప్రస్తుతానికైతే విద్యార్థుల ఫలితాలు నిలిపివేశారు. దీంతో విద్యార్థుల్లో టెన్షన్‌పట్టుకుంది. ఇదే విషయాన్ని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య దృష్టికి తీసుకెళ్లగా, రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

### పొరపాటు జరిగిందిక్కడే..

2024-25లో ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టారు. ఈ ఒక్క సబ్జెక్టులో పరీక్షావిధానం మారింది. 80 మార్కులకు థియరీ, 20 మార్కులకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. గతంలో ఇంగ్లిష్‌లో ఫెయిలైన విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉండవు.. కనుక వీరికి 100 మార్కులకు పరీక్షలు నిర్వహించాలి. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి ఓల్డ్ వర్షన్, రెగ్యులర్ విద్యార్థులకు కొత్త వర్షన్ ప్రశ్నపత్రాలివ్వాలి. కానీ ఓల్డ్ వర్షన్ ప్రశ్నపత్రాలివ్వాల్సిన వారికి న్యూ వర్షన్ ప్రశ్నపత్రాలిచ్చారు. 100 మార్కులకు నిర్వహించాల్సిన పరీక్షకు బదులు 80 మార్కుల ప్రశ్నపత్రం ఇచ్చారు. విద్యార్థులు యథాలాపంగా పరీక్షలు రాసేశారు. అధికారులు, పరీక్షాకేంద్రం సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ తప్పిదం జరిగింది. వాస్తవానికి సెంటర్లవారీగా ప్రైవేట్ (ఫెయిలైన), రెగ్యులర్ విద్యార్థుల నామినల్ రోల్స్ ఉంటాయి. ఈ రోల్స్‌లో అన్ని రకాల వివరాలుంటాయి. పైగా ఓల్డ్, కొత్త ప్రశ్నపత్రాల ప్యాకింగ్ కూడా వేర్వేరుగా ఉంటుంది. విద్యార్థులకు ఒకదానికి బదులు మరో ప్రశ్నపత్రం ఇవ్వడం... పొరపాటును గ్రహించకపోవడం గమనార్హం.



నల్లగొండలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

## పహల్గాం దాడిపై నిరసనల వెల్లువ

- **నల్లగొండ, భైంసాలో బీఆర్ఎస్ ర్యాలీ**
- **పాలమూరులో ముస్లింల నిరసనలు**
- **కామారెడ్డిలో అమరులకు నివాళులు**

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 25 : పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దమనకాండను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా భైంసాలో బీఆర్ఎస్ నాయకులు ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముస్లింలు నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీలు చేపట్టారు. మహ్మదాబాద్‌లో భారతీయ ఏక్తా ర్యాలీ నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. కామారెడ్డిలో బీఆర్ఎస్‌వై కార్యకర్తలు ఉగ్రదాడి అమరులకు నివాళులర్పించారు.

### 'పాఠశాల విద్యలో సంస్కరణలు అవసరం'

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పలు సంస్కరణలు అవసరమని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జీ సదానందంగౌడ్ అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యలో సంస్కరణలపై శుక్రవారం కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా పాఠశాలలు రూపాంతరం చెందాలని వారు పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితుల ప్రకారం టీచర్లు కూడా మారాలని సూచించారు.

### ఎస్సీ గురుకుల అడ్మిషన్లు ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో 239 గురుకుల కాలేజీల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. గురుకుల కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీతో పాటు పలు వృత్తివిద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వివరాలకు గురుకుల అధికారిక వెబ్‌సైట్ www.tgswreis.telangana.gov.in ను సందర్శించాలని, దరఖాస్తులను మే 15వ తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు.

### బీసీ సంక్షేమానికి 4,639 కోట్లు

**నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు పథకాలకు ప్రభుత్వం రూ.4,639.81కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కల్యాణలక్ష్మి పథకానికి రూ.2,173కోట్లు, బీసీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ రూ.124.44 కోట్లు, బీసీ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు రూ.250కోట్లు, స్కాలర్‌షిప్‌లకు రూ.139.37కోట్లు, ఫీజు రీయింబర్స్ స్కీమ్‌కు రూ.1,275కోట్లు, బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు రూ.80కోట్లు, బీసీ గురుకులాలకు రూ.358కోట్లు, ఈబీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు రూ.240కోట్లను మంజూరు చేసింది.

## అగ్రనేతలే టార్గెట్‌గా అడవుల్లో జల్లెడ

**కర్రె గుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్ • ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి**

ములుగు, ఏప్రిల్25(నమస్తేతెలంగాణ) : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పరిధిలోని ములుగు జిల్లా కర్రెగుట్టల వద్ద ఐదు రోజులుగా మావోయిస్టు పార్టీ అగ్రనేతలే టార్గెట్‌గా పోలీస్ బలగాలు సెర్చింగ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ పోలీస్ బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టగా హెలిక్యాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహిస్తూ అణువణువు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దీంతో జిల్లాలోని వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు పీఎల్‌జీఏ మహిళా సభ్యులు మృతి చెందగా, పలువురు మావోయిస్టులు గాయపడినట్టు బీజాపూర్ జిల్లా పోలీస్ అధికారులు తెలిపారు. మావోయిస్టు పార్టీకి చెందిన డంపు లభ్యమైనట్టు ప్రచారం జరుగుతున్నది. డీఆర్‌జీ ఎస్‌టీఎఫ్, సీఆర్పీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ చేపట్టిన ఈ జాయింట్ ఆపరేషన్ బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పీ నేతృత్వంలో కొనసాగుతున్నట్టు తెలుస్తున్నది. కర్రెగుట్టల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఆపరేషన్ హిడ్మా పేరుతో మావోయిస్టు పార్టీ మిలటరీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న హిడ్మాను టార్గెట్‌గా చేసుకొని కేంద్ర బలగాలు సెర్చింగ్ నిర్వహిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం హిడ్మా రెండు ప్లాటూన్ దళాలను వెంట పెట్టుకొని కర్రెగుట్టలకు చేరుకున్నట్టు తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర కమిటీ పరిధిలో ఉన్న కర్రెగుట్టలపై మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గిపోయాయని అంచనా వేసినప్పటికీ అనూహ్యంగా కర్రెగుట్టల వద్ద హిడ్మా వచ్చాడనే సమాచారంతో అధికారులు కేంద్ర బలగాలను అప్రమత్తం చేసినట్టు తెలుస్తున్నది. మిలటరీ ప్లాటూన్ బదలాయించడంతో పాటు మావోయిస్టుల శిక్షణకు సంబంధించిన వ్యవహారాలను చక్కబెట్టేందుకు హిడ్మా కర్రెగుట్టలపై డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు పోలీసు అధికారులు భావిస్తున్నారు. కర్రె గుట్టలపై మావోయిస్టులు మందు పాతర్లతో పాటు బంకర్లను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తుంది. కర్రె గుట్టల వద్ద ఛత్తీస్‌గఢ్ బలగాలు నిత్యం కూంబింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో గుట్టమీద ఉన్న మావోయిస్టులు తప్పించుకొని రాష్ట్రంలోకి చొరబడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసిన అధికారులు సరిహద్దు గ్రామాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ములుగు జిల్లాలోని పలు గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నట్టు తెలుస్తున్నది.

### 'ఓదెల-2'లో అభ్యంతరకర దృశ్యాలు

**తొలగించాలని సైబరాబాద్ కమిషనర్ సెన్సార్ బోర్డుకు బీసీ కమిషన్ లేఖలు**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ఓదెల-2 చిత్రంలో కులం పేరుతో ఉన్న అభ్యంతరకర దృశ్యాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ కమిషనర్‌తోపాటు ప్రాంతీయ సెన్సార్ బోర్డు అధికారికి బీసీ కమిషన్ వేర్వేరుగా లేఖలు రాసింది. అత్తాపూర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపింది. ఈ వ్యవహారంలో దర్యాప్తు జరిపి ప్రొడ్యూసర్, డైరెక్టర్, రచయిత, నటులపై చర్యలు తీసుకోవాలని కోరింది. అభ్యంతరకర పదాలు ఉన్న చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని కమిషన్ తప్పు పట్టింది.

### 'సంస్కృతం' వార్తలు అవాస్తవం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ఇంటర్‌లో సంస్కృతం రగడపై ఎట్టకేలకు ఇంటర్ విద్యాశాఖ స్పందించింది. రోజుకో వివాదానికి దారితీస్తుండటంతో శుక్రవారం స్పష్టత ఇచ్చింది. ప్రభుత్వ కాలేజీల్లో తెలుగుకు ప్రత్యామ్నాయంగా సంస్కృతం ప్రవేశపెడుతున్నట్టు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఇంటర్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) జయప్రదబాయి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా రిక్రూట్‌మెంట్‌లో 10 సంస్కృతం లెక్చరర్ పోస్టులు భర్తీ అయ్యాయని, వారికి పోస్టింగ్‌ఇవ్వడం కోసం ఏయే కాలేజీల్లో ఖాళీలున్నాయి.. విద్యార్థులెంత మంది నమోదు చేసుకున్నారన్న విషయాలనే ఆరా తీశామని తెలిపారు.

## ప్రభాకర్‌రావుకు బెయిల్ ఇవ్వండి

**ఫోన్ల ట్యాపింగ్‌పై హైకోర్టులో వాదనలు • తదుపరి విచారణ 29కి వాయిదా**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం ప్రధాన నిందితుడైన రిటైర్డ్ పోలీస్ ఉన్నతాధికారి, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టీ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. ప్రభాకర్‌రావు వయసుతోపాటు ఆయన అనారోగ్య పరిస్థితులను, మచ్చలేని ఆయన సేవలను, గత 30 ఏండ్ల సర్వీసులో ఆయన సాధించిన పతకాలను దృష్టిలో పెట్టుకుని అరెస్టు చేకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదించారు. కేసు దర్యాప్తునకు ఆయన సహకరిస్తారని, షరతులతో కూడిన ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తు పూర్తయిందని, పోలీసులు చార్జిషీట్ కూడా దాఖలు చేశారని గుర్తుచేశారు. ఈ కేసులో 6వ నిందితుడు శ్రవణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసినందున పిటిషనర్‌కు కూడా ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నప్పటికీ దర్యాప్తు అధికారులకు సహరిస్తూనే ఉన్నారని తెలిపారు. ఫోన్ల ఇంటర్ సెషన్ డిస్ట్రక్షన్ ఏదైనా రివ్యూ కమిటీ నిర్ణయం మేరకే జరుగుతుందని, ఆ కమిటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ ఉంటారని పేర్కొంటూ.. ఈ కేసులో వారి వాంగ్మూలాలను ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చినవారిని కాకుండా ఆర్ఎస్ఐ, ఎస్ఐ లాంటి అధికారుల వాంగ్మూలాలను తీసుకుని పిటిషనర్‌ను బాధ్యుడిని చేస్తున్నారని తప్పుపట్టారు. రివ్యూ కమిటీలో పిటిషనర్ సభ్యుడు కూడా కాదని, హార్డ్ డిస్క్ ధ్వంసంలో పిటిషనర్ పాత్ర లేదని చెప్పారు.

**బెయిల్‌కు పతకాలు ప్రామాణికం కాదు**

ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ప్రతివాదన చేస్తూ.. వయసు, అనారోగ్య పరిస్థితులను అడ్డంపెట్టుకుని కేసు విచారణ నుంచి పిటిషనర్ తప్పించుకునేందుకు వీల్లేదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రభాకర్‌రావు పతకాలు సాధించినంత మాత్రాన మంచివాడు అవ్వడని, దేశం తరఫున పలు యుద్ధాల్లో పాల్గొని పరమ విశిష్ట, అతి విశిష్ట సేవా పతకాలు పొందిన షాబెగ్ సింగ్ పంజాబ్ తీవ్రవాద సంస్థ (జమైల్‌సింగ్ బింద్రన్ వాలే గ్రూపు) సలహాదారుగా చేరి, ఆపరేషన్ బ్లూస్టార్‌లో హతమయ్యాడని వివరించారు. ఫోన్ల ట్యాపింగ్ కేసు నమోదవగానే ప్రభాకర్‌రావు అమెరికాకు పారిపోయారని, ఆయన పాస్‌పోర్టును రద్దు చేయడంతోపాటు రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయడంతో విధిలేక భారత్‌కు తిరిగి రాబోతున్నారని పేర్కొంటూ.. పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. తదుపరి విచారణను 29కి వాయిదా పడింది.

### తీన్మార్ మల్లన్నకు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో తమపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, సూర్యాపేట ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి సంయుక్తంగా దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదిగా ఉన్న ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) తోపాటు పోలీసులను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. జస్టిస్ మౌసమీ భట్టాచార్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను జూన్ 13కు వాయిదా వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కేటీఆర్, జగదీశ్‌రెడ్డి నకిలీ వీడియోలను విడుదల చేసి తనను అప్రతిష్టపాలు చేశారని తీన్మార్ మల్లన్న ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో నిరుడు మే 25న కేసు నమోదైంది.

### రేవంత్‌కు హైకోర్టులో ఊరట

**బీజేపీ కేసులో వ్యక్తిగత విచారణ నుంచి మినహాయింపు**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి స్వల్ప ఊరట లభించింది. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగే ఈ కేసు విచారణకు రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెంలో జరిగిన ప్రచార సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యల వల్ల బీజేపీ పరువుకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై కౌంటర్ వేయాలని కాసం వెంకటేశ్వర్లుకు నోటీసులు జారీచేసిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను జూన్ 13వ తేదీకి వాయిదా వేశారు.

## వ్యవసాయంలో ఏఐ వినియోగం

**2047 నాటికి మానవరహిత వ్యవసాయం లక్ష్యంగా ప్రణాళికలు**


**బిట్స్ పిలానీ, అగ్రికల్చర్ వర్సిటీ మధ్య అవగాహనా ఒప్పందం**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయంలో కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బిట్స్ పిలానీ మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలోని అగ్రిహబ్‌లో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వీ రాంగోపాల్‌రావు సమక్షంలో అవగాహన ఒప్పందంపై ఆయా సంస్థల అధికారులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం పరిశోధనా ప్రాజెక్టుల రూపకల్పనకు, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనల్లో సలహాలకు దోహదం చేయనున్నట్టు బిట్స్ పిలానీ ఉప కులపతి ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు పేర్కొన్నారు. అగ్రికల్చర్ వర్సిటీ ఉప కులపతి జానయ్య మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ప్రాచీన వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో తెలంగాణ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం రెండోదని, 2047 నాటికి మానవరహిత వ్యవసాయమే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం, రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్, బిట్స్ పిలానీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అరవైలో.. టీనేజర్లతో పోటీ

- **ఇంజినీరింగ్, ఫార్మసీ చదివేందుకు వృద్ధుల ఆసక్తి**
- **ఎప్‌సెట్ పరీక్షకు అనుమతించిన జేఎన్టీయూ**
- **ఎప్‌సెట్‌కు 3.06లక్షల దరఖాస్తులు**
- **ఈ నెల 29 నుంచి పరీక్షలు ప్రారంభం**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : అరవై ఏండ్ల వయస్సులోనూ మాకేం తక్కువ అంటూ టీనేజర్లతో పోటీపడుతున్నారు కొందరు వృద్ధులు. అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్ పరీక్షకు 56, 58 ఏండ్ల వయస్సు వారు దరఖాస్తు చేశారు. 56 ఏండ్ల గల పెద్దాయన ఇంజినీరింగ్‌కు, 58ఏండ్లున్న మరో పెద్దాయన అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి దరఖాస్తు చేశారు. ఎప్‌సెట్ దరఖాస్తు స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. ఎప్‌సెట్‌కు 3.06 లక్షల దరఖాస్తులొచ్చాయి. ఇంజినీరింగ్‌కు 2.20లక్షలు, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 86వేలు, రెండు పేపర్లు రాసేందుకు 254 మంది చొప్పున విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 29 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి మూడు సెషన్లు, ఇంజినీరింగ్‌కు మొత్తం 6 సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 112, ఇంజినీరింగ్ విభాగం పరీక్షల కోసం 124 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు.



ఖమ్మంలో జరిగిన ఉద్యోగ సదస్సులో మాట్లాడుతున్న టీజీఈ జేఏసీ చైర్మన్ జగదీశ్వర్

## సమస్యలు పరిష్కరించకుంటే సత్తా చూపుతాం

- **పెండింగ్‌లోనే ఐదు డీఏలు, పీఆర్సీ**
- **బకాయిలు రూ.650 కోట్ల చొప్పున చెల్లిస్తామని చెప్పి.. పైసా ఇవ్వలే**
- **పాతపెన్షన్ పాలసీ అమలు చేయాలి**
- **టీజీఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం, ప్రధాన కార్యదర్శి ఏలూరి**

ఖమ్మం, ఏప్రిల్ 25 : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే తమ సత్తా ఏమిటో సీఎం రేవంత్‌రెడ్డికి చూపించాల్సి వస్తుందని టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి 16 నెలలైనా మంత్రుల పేషీల్లో ఇప్పటికీ ఉద్యోగ సంఘ నాయకులను గుర్తించడంలేదని తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి బయలుదేరిన ర్యాలీ నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాలు వరకు కొనసాగింది. టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, బకాయిలు నెలకు రూ.650 కోట్ల చొప్పున చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు రూపాయి కూడా విదల్చలేదని విమర్శించారు.